ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
మంగళవారం 5 మార్చి 2024

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

- నేడు పటాన్‌చెరుకు మోదీ రాక .. ఏర్పాట్లు పూర్తి
- సభా స్థలి వద్దే హెలీప్యాడ్
- కట్టుదిట్టమైన భద్రత
- విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని

7లో

నేటి నుంచి కేతకీలో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు



ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం

ఝరాసంగం, మార్చి 4: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 13 వరకు వైభవంగా జరుగనున్నాయి, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణ ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణలో బారికేడ్లు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

ఆలయానికి చేరుకోండిలా..

జహీరాబాద్ పట్టణానికి 16 కిలోమీటర్ల దూరంలో కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి వచ్చేందుకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి జహీరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. జహీరాబాద్‌కు వచ్చాక ఆర్టీసీ అధికారులు జాతర సందర్భంగా ఝరాసంగంకు స్పెషల్ బస్సులు నడుపుతారు.

పూజా కార్యక్రమాలు..

5న అంకురార్పణం, ధ్వజారోహనం, విఘ్నేశ్వర పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం 11 గంటలకు స్వామివారికి శిఖర పూజ, 6న స్వామివారికి రుద్రాభిషేకం, రాత్రి పల్లకీసేవ, 7న సాయంత్రం శేషవాహన సేవ, రాత్రి పల్లకీసేవ, 8న మహాశివ రాత్రి, గణపతి హోమం, రాత్రి లింగోద్భవ మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 9న నందివాహన సేవ, అగ్నిగుండం, 10న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి విమాన రథోత్సం, 11న పల్లకీసేవ, అమ్మవారికి కుంకుమార్చన, 12న స్వామి అభిషేకం, రాత్రి పల్లకీసేవ, 13న స్వామివారికి అభిషేకం, స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించనున్నారు.

కొడుకు తీరుతో విసుగు చెంది కత్తులతో తండ్రి దాడి


దాడిలో గాయపడిన వంశీ

తూప్రాన్, మార్చి 4: కొడుకు తీరుతో విసుగు చెందిన తండ్రి మరొకరి సహాయంతో కొడుకుపై కత్తులతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు గొల్ల వంశీ(25) వ్యవసాయం చేస్తుండగా, చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. మూడేళ్ల క్రితం వంశీకి వర్నికి చెందిన శిరీషతో వివాహమైంది. అప్పటికే తాగుడు, బెట్టింగులకు వంశీ అలవాటు పడటంతో భార్యను నిత్యం కొడుతుండడంతో ఆమె పుట్టింటికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. దాంతో తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొడుకు తీరుతో విసుగు చెందిన తల్లి విజయ ఆరునెలల క్రితం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నది. అయితే కొడుకు రూ.20 లక్షల అప్పులు చేయడంతో తండ్రి భూమి అమ్మి తీర్చాడు. అయినా అతడిలో మార్పురాకపోగా.. బాగా తాగడం, బెట్టింగ్‌లు చేస్తున్నాడు. దీంతో విసుగు చెందిన తండ్రి ఆదివారం ఇంట్లో ఉండొద్దంటూ బట్టలు బయట పడేశాడు. అర్ధరాత్రి వంశీ మద్యం సేవించి ఇంటికి రాగా.. తండ్రి తలుపులు తీయకపోవడంతో ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడిన వంశీ తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆవేశానికి గురైన తండ్రి కిష్టయ్యతో పాటు ఇంట్లో పడుకున్న ట్రాక్టర్ డ్రైవర్ కొండాపురం లక్ష్మణ్ కలిసి వంశీపై కత్తులతో విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ దాడిలో వంశీ చేతులు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా వంశీపై దాడికి పాల్పడిన ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

దుబ్బాక, మార్చి 4: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగారం తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన బాలే బాల్‌రాజ్ కుమారుడు అవినాష్(35) ఏడాదిన్నర క్రితం లచ్చపేటకు చెందిన మహమూద్ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకుని దుబ్బాక పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అద్దెకు ఉంటున్నాడు. రెండు నెలల నుంచి భార్యతో గొడవ జరగ్గా.. ఆమె పుట్టింటికి వెళ్లి రావడం లేదు. అయితే అవినాష్ మూడురోజుల నుంచి తలుపులు తీయడం లేదు. సోమవారం సాయంత్రం సదరు ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటి యజమాని మూడ శివ సహాయంతో పైకప్పు తెరిచి చూడగా అవినాష్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే మృతదేహాన్ని కిందకు దింపి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గంగారం తెలిపారు.



పటేల్‌గూడ వద్ద సభా ప్రాంగణంలో జనం కూర్చునేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీ


విజయ సంకల్ప సభా వేదిక

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

నేడు సంగారెడ్డి జిల్లాకు మోదీ రాక
- పటేల్‌గూడలో ఏర్పాట్లు పూర్తి
- సభా స్థలి వద్దే హెలీప్యాడ్
- కట్టుదిట్టమైన భద్రత
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పటాన్‌చెరు, మార్చి 4 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంగారెడ్డి జిల్లా పర్యటనకు సర్వం సిద్ధమైంది. పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడ ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల పక్కన సభా ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాని నరేంద్రమోదీతో పాటు గవర్నర్ తమిళిసై, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొననున్నారు. ప్రధాని, సీఎం పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణాన్ని ఎస్‌పీఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేష్ అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభా స్థలిలో సుమారు లక్ష మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలోనే రెండు హెలీప్యాడ్‌లను నిర్మించారు. అత్యవసరంగా పటాన్‌చెరు శివారులోని ఇక్రీశాట్‌లో మరో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. సోమవారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెలీకాఫర్‌లు, ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు.

విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని

మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా సభా స్థలి సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగనున్నారు. తొలుత పలు అభివృద్ధి పనులను ప్రధాని మోదీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అలాగే వర్చువల్‌గా పలు ప్రగతి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరిగివెళ్లిపోతారు. తర్వాత నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. బహిరంగ సభకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి నుంచి సుమారు లక్ష మంది జనసమీకరణ చేసేందుకు బీజేపీ నాయకత్వం కార్యాచరణ రూపొందించారు.

రూ.9,021 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో మొత్తం రూ.9,021కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను వర్చువల్‌గా చేస్తారు. పూణే - హైదరాబాద్ రహదారిలో సంగారెడ్డి క్రాస్ రోడ్డు మీదుగా మదీనగూడ వరకు రూ.1,298 కోట్లతో ఆరులేన్ల జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. రూ.399 కోట్లతో మెదక్ ఎల్లారెడ్డి రెండో లైన్ హైవే విస్తరణ పనులకు, రూ.500 కోట్లతో ఎల్లారెడ్డి రుద్రూర్ హైవే పనులకు శంకుస్థాపనలు చేస్తారు. రూ.3,338 కోట్లతో ఏర్పాటు చేసిన పారాదీప్ హైదరాబాద్ గ్యాస్ పైపులైన్‌ను జాతికి అంకితం చేస్తారు. రూ.400 కోట్లతో నిర్మించిన సివిల్ ఏవియేషన్ రిసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. రూ.1,409 కోట్లతో నిర్మించిన కంది రాంసాన్‌పల్లి నాలుగు లేన్ల జాతీయ రహదారిని ప్రారంభిస్తారు. రూ.323 కోట్లతో నిర్మించిన మిర్యాలగూడ, కోదాడ రెండో లైన్ జాతీయ రహదారిని, రూ.1165 కోట్లతో నిర్మించిన హైదరాబాద్ - సికింద్రాబాద్ పరిసరాలలో ఎంఎంటీఎస్ రెండో దశ పనులను ప్రారంభిస్తారు.

ట్రాఫిక్ ఆంక్షలు

మంగళవారం ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ప్రధాని సభకు పలు నియోజకవర్గాల నుంచి హాజరయ్యే వారికి సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పటాన్‌చెరు శివారులోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల పక్క ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు చేరుకునేందుకు ప్రత్యేక రూట్లను కేటాయించారు. కామారెడ్డి, రామాయంపేట, తూప్రాన్ వైపు నుంచి వచ్చే వాహనాలు శామీర్‌పేట వద్ద, మెదక్, నర్సాపూర్ నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు గుండ్లపోచంపల్లి వద్ద, సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట నుంచి వచ్చే బస్సులు ముత్తంగి ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ మూడు వద్ద, హత్నూర, దౌల్తాబాద్ నుంచి వచ్చే వాహనాలు సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ వద్ద దిగి కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా, ఎల్లంకి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలిపి సభావేదిక వద్దకు నడుచుకుంటూ వెళ్లాలని సూచించారు. కార్లలో వచ్చే వారికి ప్రత్యేకించి రామేశ్వరంబండలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలుపుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను బీరంగూడా కమాన్ నుంచి లోనికి అనుమతించరు. పటాన్‌చెరు శివారులోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి పటేల్‌గూడా కిష్టారెడ్డిపేట రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించారు.

డ్రోన్‌లపై నిషేధం : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, మార్చి 4 : పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ఈ నెల 5వ తేదిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ, పలు అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నందున జిల్లా వ్యాప్తంగా డ్రోన్‌ల ఎగరవేతను నిషేధించినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా, ఇక్రిశాట్ పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ ప్రాంగణానికి రెండు కిలోమీటర్ల మేర రెడ్ అలర్ట్ విధిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



సభా స్థలి వద్ద మోదీ కటౌట్

తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుపు

- కేసీఆర్ అవినీతిపై శిక్షించాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదు
- నేటి మోదీ సభ మంచి ప్రభావం చూపిస్తుంది
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి
- మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సంగారెడ్డి అర్బన్, మార్చి 4: తెలంగాణ రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు పటాన్‌చెరులో జరగబోయే భారత్ విజయసంకల్ప సభ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ప్రభావం చూపిస్తుందని ధీమావ్యక్తం చేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. అన్ని పార్లమెంట్ స్థానాల్లో మంచి మెజారిటీతో గెలవాలనే ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను బయటకు తీయడం మంచిదే అయినప్పటికీ అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్‌కు శిక్షించాలనే ఆలోచనే లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డపై ముందే ఎందుకు కమిటీ వేయలేదని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఓట్ల కోసమే కమిటీల పేరిట డ్రామాలాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిందని అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి ఎవరొచ్చినా బీజేపీలోకి ఆహ్వానిస్తామని, తెలంగాణ అభివృద్ధికి ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని సూచించారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉంటే తొమ్మిది లక్షల కోట్ల అభివృద్ధి జరిగిందని, అలాంటప్పుడు అన్ని స్థానాల్లో బీజేపీ గెలిపిస్తే ఇంకెంత అభివృద్ధి చెందుతుందో గ్రహించాలన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం, తద్వారా మరో ఐదేళ్లలో భారత్ అగ్రరాజ్యంగా ఎదగడం ఖాయమన్నారు. మోదీ సభకు లక్షకుపైగా జనసమీకరణ చేస్తున్నామని, ఉదయం 11.30 గంటలకు సభ ప్రారంభమౌతుందని, ప్రజలు తరలి వచ్చి మోదీ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులిమామిడి రాజు, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, సంగమేశ్వర్, మాణిక్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

- సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 4: ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఆయా ఫిర్యాదులకు, అర్జీలకు సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కార మార్గం చూపాలన్నారు. ప్రజావాణికి మొత్తం 42 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన వారిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలను బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసిండ్రు

1999లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో 2.20 ఎకరాల భూమిని 80 మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చి పట్టాలు అందించారని, దీనిని బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారని కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన మహిళలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి మీ స్థలాన్ని అందేలా చూస్తానని కలెక్టర్ హామీఇచ్చారు.

మా భూమిని మాకు ఇవ్వాలి

మా భూమి మాకు ఇవ్వాలని రంగధాంపల్లికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మిట్టపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 966 సర్వే నెంబర్లు 1.21 ఎకరాల భూమిని దహన సంస్కారాలకు కేటాయించామని, ఎలాంటి సమాచారం లేకుండా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రొసీడింగ్ ఇచ్చారని అన్నారు. దానిని వెంటనే రద్దు చేసి శ్మశానానికి కేటాయించి నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

నెరవేరిన జూనియర్ లెక్చరర్ కళ


మహిపాల్‌రెడ్డి

మద్దూరు, మార్చి 4: ఎన్నోఏళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేక.. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో చదివి ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు మద్దూరు మండలం మర్మాముల గ్రామానికి చెందిన గుండ్రెడ్డి మహిపాల్‌రెడ్డి. గ్రామానికి చెందిన గుండ్రెడ్డి వెంకటమ్మ, వీరనర్సింహారెడ్డి దంపతులకు నలుగురు కుమారులు. ఇందులో మహిపాల్‌రెడ్డి చిన్నవాడు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా జాబ్ చేస్తున్నాడు. గురుకుల నోటిఫికేషన్ పడడంతో.. జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించాలని రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలు రాశాడు. దీంతో రాష్ట్రస్థాయిల్ జేఎల్ కామర్స్‌కు-13వ ర్యాంకు, పీజీటీకి-15వ ర్యాంకు, టీజీటీకి-18వ ర్యాంకు సాధించి.. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించుకున్నాడు. కష్టపడ్డందుకు ఫలితం దక్కిందని, ఆనందంగా ఉన్నదని మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

సిద్దిపేట క్రైం, మార్చి 4: దొంగతనం, పోగొట్టుకున్న 63 ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా సీఈఐఆర్‌లో డాటా నమోదు చేస్తే స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. 2023 ఏప్రిల్ 20 నుంచి ఇప్పటి వరకు 440 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు సీఈఐఆర్ పోర్టల్‌లో జిల్లాలో 2100 మంది సెల్‌ఫోన్లు పోయినట్లు నమోదు చేసుకున్నారని, వాటిలో 657 సెల్ ఫోన్లు ట్రేస్ అవుట్ చేసి.. 440 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అపర్ణపాటిల్

- ఏకగ్రీవంగా ఎన్నిక
- పార్టీలు పక్కనపెట్టి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు

సదాశివపేట, మార్చి 4 : సదాశివపేట మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ చీలిక వర్గానికి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలో 26 మంది కౌన్సిలర్లు ఉండగా 18 మంది మద్దతుతో అపర్ణపాటిల్ చైర్‌పర్సన్‌గా పదవీ ప్రమాణం చేశారు. ఫిబ్రవరి 9న నిర్వహించిన సమావేశంలో 21 మంది కౌన్సిలర్ల ఓట్లతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్‌పర్సన్‌గా ఉన్న పిల్లోడి జయమ్మ పదవిని కోల్పోయారు. సోమవారం కొత్త చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు.

18 మంది కౌన్సిలర్ల మద్దతు

స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి, సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోరంకు అవసరమైన 19 మంది కౌన్సిల్ సభ్యులు హాజరవడంతో ఆర్డీవో ఎన్నిక జరిపారు. 23వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇంద్రమోహన్‌గౌడ్ కొత్త చైర్‌పర్సన్ అభ్యర్థిగా బీఆర్ఎస్ చీలిక వర్గానికి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణపాటిల్ పేరును ప్రతిపాదించారు. 20వ వార్డు కౌన్సిలర్ ఆకుల శివకుమార్ బలపరిచారు. 18 మంది కౌన్సిలర్లు అనుకూలంగా మద్దతును ప్రకటించారు. దీంతో ఆర్డీవో వసంతకుమారి కొత్త చైర్‌పర్సన్‌గా అపర్ణపాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరించారు. అనంతరం చైర్‌పర్సన్ అపర్ణపాటిల్ పదవీ ప్రమాణం చేశారు.


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

మద్దతు తెలిపిన కౌన్సిలర్లు వీరే..

కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ప్రత్యేక సమావేశంలో 19 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముంతాజ్‌బేగం, రేష్మాబేగం, రజియాబేగం, నస్రీన్‌బేగం, వడ్ల మహేశ్వరి, నల్ల శివలక్ష్మి, ఇంద్రమోహన్‌గౌడ్, చౌదరి ప్రకాష్, విద్యాసాగర్‌రెడ్డి, చింతా గోపాల్, ఆకుల శివకుమార్, బీజేపీ కౌన్సిలర్ ఓడెల రాజేశ్వరి, ఎంఐఎం పార్టీ కౌన్సిలర్లు ఖుద్దుస్ ఖురేషీ, షహజాదీబేగం, బీఆర్ఎస్‌లో చేరిన స్వతంత్ర కౌన్సిలర్ ఇలియాజ్‌షరీఫ్‌తో పాటు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు పిచరాగడి రేణుక, సాతాని లలిత, నేనావత్ శ్రీనివాస్ అపర్ణపాటిల్‌కు మద్దతు పలికారు. చైర్‌పర్సన్ ఎన్నికలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలేవి విప్ నోటీసులను ప్రిసైడింగ్ అధికారికి అందజేయలేదు.


చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అపర్ణపాటిల్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్డీవో వసంతకుమారి

రేపు తూప్రాన్ మున్సిపల్ అవిశ్వాస సమావేశం

తూప్రాన్, మార్చి 4: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశం బుధవారం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. మున్సిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానంపై 11 మంది కౌన్సిలర్లు సంతకం చేసి గతనెల 11న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో క్యాంపునకు వెళ్లారు. చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ వర్గం ఐదుగురితో క్యాంపునకు తరలివెళ్లింది. అవిశ్వాసంపై సంతకం చేసిన రెండో వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ ఇంటి వద్ద పనుందంటూ వచ్చి చైర్మన్ వర్గంలో కలిసిపోయాడు. దీంతో చైర్మన్ వర్గంలో ఆరుగురయ్యారు.

భూకబ్జా కేసులే కీలకం!

తూప్రాన్ పట్టణంలోని పుట్టకోటలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విక్రయించారంటూ ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. సర్వే ఆధారంగా కౌన్సిలర్, ఇద్దరు మహిళా కౌన్సిలర్ల భర్తలపై పోలీసులు నాలుగు రోజుల క్రితం క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అవిశ్వాసంలో పోలీసులు కేసులు కీలకం కానున్నట్లు ప్రచారం జరుగుతుంది.

అటు వృథా.. ఇటు వ్యధ..



వెంకటాపూర్ రైతువేదిక వెనుక ఉన్న కాలువ నుంచి వృథాగా పోతున్న సాగునీరు

అధికారుల పర్యవేక్షణ లోపం.. రైతులకు అవగాహన లేక కాలువల ద్వారా వెళ్లాల్సిన సాగునీరు చెలకల్లో వృథాగా పోతుంది. రంగనాయకసాగర్ కుడికాలువ ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే, నంగునూరు మండలం వెంకటాపూర్ అప్పలాయచెరువు రాంపూర్ మీదుగా బద్దిపడకు వెళ్లే కాలువలో కొందరు మోటార్లు బిగించి నీటిని తరలిస్తున్నారు. కాలువలు లేకుండా నీటిని మళ్లించడంతో నీరంతా చెలకలు పట్టుకుని వృథాగా వెళ్తుంది. నీటిని వదిలే ముందు అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. అలాగే రైతుల మధ్య సమన్వయం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో పక్కనుంచే కాలువ పోతున్నప్పటికీ చెరువుల్లోకి చుక్క నీరు చేరడం లేదు. చెరువుల్లోకి నీటిని మళ్లించే ప్రణాళిక లేకుండా కాలువలు ఎలా తీశారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువల నీటిని చెరువుల్లోకి నింపి భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

– నంగునూరు, మార్చి 4



కొన్గల్‌లో నీరులేక ఎండిపోయిన వరి పంట

తొగుట మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు బోరుబావుల మీదనే ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. వారం, పదిరోజులుగా ఎండల తీవ్రత అధికమవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తలాపున మల్లన్నసాగర్ ఉన్నప్పటికీ బోరుబావుల్లోకి నీటి ఊటలు రాకపోవడంతోనే పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో సాగునీటి కోసం ఇంకా ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ఒకింత ఆందోళన చెందుతున్నారు. పంట సాగుకు వేల రూపాయల పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు ఆ పంటలను రక్షించుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– తొగుట, మార్చి 4



రామునిపట్లలో రాజీవ్ రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

సాగునీటి కోసం చిన్నకోడూరు మండలంలోని కొత్తపల్లి, మాచాపూర్ గ్రామానికి చెందిన రైతులు రామునిపట్లలోని రాజీవ్ రహదారిపై సోమవారం ధర్నా చేపట్టి మాట్లాడారు. రంగనాయకసాగర్ ఎడమ కాలువ కింద ఉన్న ఆర్‌డీ-3 పరిధిలోని, ఆర్ఎం- 2 కాలువకు మాచాపూర్ వద్ద పర్మినెంట్ ఓటీ పాయింట్ (షెటర్) ఏర్పాటు చేయాలని లేదంటే ఆర్ఎం- 2 కాలువకు అనుసంధానంగా ఉన్న ఎల్ఎస్ఎం-3 కాలువ నిర్మాణం చేపట్టి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరందక పంటలు ఎండుముఖం పడుతున్నాయని ఆవేదన చెందారు. విషయం తెలుసుకున్న చిన్నకోడూరు పోలీసులు, రాజగోపాలపేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ రాజమల్లు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

– చిన్నకోడూరు, మార్చి 4

గజ్వేల్ పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

గజ్వేల్, మార్చి 4: గజ్వేల్ పాలిటెక్నిక్ రెసిడెన్షియల్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అర్జున్‌కుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, న్యూట్రీషన్ ఫుడ్ నిధులు సకాలంలో విడుదల కాని కారణంగా విద్యార్థులపై విద్యా, వసతి, భోజన పరమైన ఫీజుల రూపంలో ఆర్థిక భారం పడుతుందన్నారు. వెంటనే అధికారులు రాష్ట్రప్రభుత్వం, సంబంధిత సాంకేతిక విద్యాశాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట నాయకులు ఎగ్గిడి వేణు తదితరులున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

- ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక
- అయినా పూర్తి కాని నిర్మాణాలు
- మంత్రి చొరవ తీసుకోవాలని వేడుకోలు



అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

హుస్నాబాద్, మార్చి 4: పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ, సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో లబ్ధిదారులు ధర్నా చేశారు. అనంతరం ఈ విషయమై అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసినా, ఇంకా వాటి నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో వాటిల్లోకి వెళ్లలేక పోతున్నామని తెలిపారు. ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి వెంటనే ఇళ్లను పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, చిత్తారి శ్రీనివాస్, ఇంద్రాల సారయ్య, పద్మ, ప్రియ, శారద, కవిత, మంజుల తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

హుస్నాబాద్/చేర్యాల మార్చి 4 : హుస్నాబాద్ పట్టణంలోని నల్లరాళ్లవాడలో రవీందర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. 70 బస్తాలను స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల అధికారులకు అప్పగించారు. అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొమురవెల్లి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన కడమంచి తిరుపతి, ఐనాపూర్‌కు చెందిన జైన నరేశ్‌లు ఐనాపూర్ గ్రామ నుంచి 15క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా, రసూలాబాద్ శివారులో వారిని పట్టుకున్నామని, ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలి

- ఏవో నాగేందర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్నఏవో

జగదేవ్‌పూర్, మార్చి 4: డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలని మర్కూక్ మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి సూచించారు. మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారు రైతుల వరి పొలాల్లో డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఫ్కో సంస్థ వారు అందించిన ఈ డ్రోన్‌ను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం కూలీల కొరత ఉందన్నారు. తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేయడానికి ఈ డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇఫ్కో సంస్థ సిద్దిపేట జిల్లా అధికారి చంద్రబాబు, కొండ పోచమ్మ ఉత్పత్తిదారుల సంస్థ సీఈవో శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, మార్చి 4: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం తిమ్మక్కపల్లిలో రూ. 8లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ యాదగిరి, ఎంపీటీసీ వెంకటయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, నాయకులు దయాకర్, మున్న పాల్గొన్నారు. అనంతరం దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలో జరుగుతున్న మల్లన్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నర్సంపల్లి కెనాల్‌ను పరిశీలించారు.

పుస్తకపఠనంతో మేధోసంపత్తి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్



ముస్త్యాల గ్రామంలో పౌరపఠనమందిరంలో పుస్తకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చేర్యాల, మార్చి 4: పుస్తక పఠనంతో మేధోసంపత్తి పెంపొందడంతో పాటు విషయ పరిజ్ఞానం మెరుగుదలకు దోహదపడుతుందని సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల, చుంచనకోట గ్రామాలలో ఏర్పాటు చేసిన పౌరపఠన మందిరాలను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, పౌరపఠన మందిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పాఠశాల సమయం ముగిసిన తర్వాత తరగతి పుస్తకాలతో పాటు కథల పుస్తకాలు, విషయ పరిజ్ఞాన పుస్తకాలు, చరిత్ర, సంస్కృతి తదితర పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని తెలిపారు. పౌరపఠన మందిరాలను నిర్వాహకులు ఎల్లప్పుడూ తెరిచే ఉంచాలని, విద్యార్థులు, యువతకు అవసర మైన పుస్తకాల వివరాలను రిజిష్టరులో నమోదు చేయించి జిల్లా గ్రంథాలయ సంస్థ సిద్దిపేటవారికి తెలియపరచాలని ఆదేశించారు. ఆయా కేంద్రాలలో కనీస సౌకర్యం కల్పించాలని ప్రత్యేకాధికారికి సూచించారు. అనంతరం పాఠశాలల విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధనపై ఆరా తీశారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ సిద్దిపేట కార్యదర్శి ఏపీయస్ రాజు, ఎంఈవో మొగుల్ల నర్సింహ్మరెడ్డి, సీడీపీవో శారద, జీపీ ప్రత్యేకాధికారి దివ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

వర్గల్/గజ్వేల్ మార్చి 4: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్‌లో వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అభిలాష్ కాంస్య పతకాన్ని సాధించాడు. పతకాన్ని సాధించిన అభిలాష్‌ను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌గౌడ్, మాస్టర్ నరేష్ అభినందించారు. ఈ నెల 3న హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీల్లో బుడోఖాన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్‌కు చెందిన గజ్వేల్ విద్యార్థులు సత్తాచాటారు. సెయింట్ మేరీస్ హైస్కూల్‌కు చెందిన శ్రీజ బంగారు పతకాన్ని, స్వాతి వెండి పతకాన్ని సాధించగా, నలందా హైస్కూల్‌కు చెందిన నర్సింహ్మ వెండి పతకం, దేవాన్ష్ కాంస్య పతకాన్ని సాధించారు. వర్గల్ మండలం శాఖారం గ్రామానికి చెందిన వంశీ బంగారు పతకాన్ని సాధించాడు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

చేర్యాల, మార్చి 4: చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన తుంగ అనూష, రవళి హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి 13వతేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ పట్టణంలో జరిగే 52వ సీనియర్ ఉమెన్స్ పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుతరుపున పాల్గొననున్నారు. ఈ మేరకు ఇరువురిని సోమవారం జిల్లా హ్యాండ్‌బాల్ కార్యదర్శి ఎండీ. రఫత్ ఉమర్ అభినందించారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్



మండలంలోని చంద్లాపూర్‌లో ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో

చిన్నకోడూరు, మార్చి 4: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని అల్లీపూర్, చిన్నకోడూరు, మెట్టుపల్లి, గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, పొద్దుతిరుగుడు పంటలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రైతులకు పలు యాజమాన్య పద్ధతులను వివరించారు. రామంచ, చంద్లాపూర్, చిన్నకోడూరు, అల్లీపూర్ గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ షాపుల్లోని ఎరువుల, పురుగు మందుల నిల్వల రికార్డులను, అనుమతి పత్రాలను పరిశీలించారు. నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో జయంత్‌కుమార్, ఏఈవోలు జాన్సీ జమీల్, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



చిన్నకోడూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు, మార్చి 4: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే పొద్దుతిరుగుడు విత్తనాలను విక్రయించి మద్దతు ధర పొందాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. చిన్నకోడూరు మార్కెట్ యార్డులో సోమవారం ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి ఆమె పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పంటలకు సాగు నీరు అందుతుండడంతో రైతులు వరి పంటతో పాటు, వాణిజ్య పంటలు పండిస్తున్నారని ఆమె తెలిపారు. మన దేశానికి విదేశాల నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటామని, గత ప్రభుత్వం సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించిందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఏస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచులు ఉమేష్ చంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పార్క్ కుంగ్‌ఫూలో సత్తా చాటిన విద్యార్థులు

సిద్దిపేట టౌన్, మార్చి4: సికింద్రాబాద్‌లో జరిగిన నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్ ఛాంపియన్‌షిప్ కుంగ్‌ఫూ పోటీల్లో సిద్దిపేటకు చెందిన ఎస్ఆర్‌డీజీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వీరిలో రామ్ (గోల్డ్) అభినయ్ (సిల్వర్) కృతిక్ సాయివర్మ, ప్రసన్ తేజు, సప్రిన్, శాన్విత (బ్రాన్జ్) మెడల్ సాధించారు. మెడల్ సాధించిన వీరిని స్పార్క్ కుంగ్‌ఫూ శిక్షకుడు రఘునందన్‌రెడ్డి, ఎస్ఆర్‌డీజీ పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, శిక్షకులు బాలు, శ్రీనివాస్ అభినందించారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం

మద్దూరు, మార్చి 4 : మద్దూరు మండలం ఖల్దూర్రులో శ్రీవీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని మేళతాళాల మధ్య అంగరంగ వైభవగంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పెద్దలు ప్రతికంఠం రామ్మూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవాకేంద్రాల ఏర్పాటు

చేర్యాల, మార్చి 4 : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో సోమవారం చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో-1, మునిసిపల్ కార్యాలయంలో రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గతంలో దరఖాస్తు చేసుకున్న వారు వివరాలు పరిశీలించుకుని, సరిచేసుకోవడంతో పాటు నూతనంగా దరఖాస్తుల స్వీకరించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో ఎంపీడీవో మహబూబ్ అలీ, మునిసిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుస్నాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు మండలం కూటిగల్‌కు చెందిన ముప్పారపు కొంరయ్య (65) ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో అక్కన్నపేట- రామవరం బైపాస్‌రోడ్డుపై కుక్కలు అడ్డురావడంతో ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స నిమిత్తం అతన్ని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు.

విచారణ చేపట్టాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి జిల్లా అధికారులను కోరారు. అధికారులు, పాలకవర్గం కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

పల్స్ పోలియో పరిశీలన

మద్దూరు : మద్దూరు, లద్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్నారులకు వేస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సోమవారం స్టేట్ టీం అధికారి ప్రమీలారాణి డీపీహెచ్ఎన్ మేరి, హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు. వారివెంట వైద్యాధికారి రజిత, సీహెచ్‌వో జి.శేషగిరి, హెల్త్ అసిస్టెంట్ రఘు పాల్గొన్నారు.

జీరో కరెంటు బిల్లుల పంపిణీ

కొండపాక : మండలంలోని సిరిసనగండ్లలో ట్రాన్స్‌కో ఏఈ సత్యం జీరో కరెంటు బిల్లులను అందజేశారు. ప్రభుత్వం ప్రకటించినట్టుగా తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకున్న వారికి జీరో బిల్లులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు

- బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, మార్చి 4 :రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు తప్పడం లేదని జడ్పీటీసీ తడిసిన ఉమా వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాళేశ్వరంపై రాద్ధాంతాన్ని పక్కన పెట్టి రైతులకు సాగునీరు అందేలా చూడాలన్నారు. కాళేశ్వరంలో పుష్కలంగా నీరున్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వకపోవడం వల్లనే మోటార్లు కాలిపోయి, పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు దువ్వల మల్లయ్య, రాగుల సారయ్య, సహకార సంఘం చైర్మన్ కోల రమేశ్ గౌడ్ ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి, నాయకులు బద్దిపడగ కిష్టారెడ్డి, ఎంపీటీసీ బెదురు తిరుపతి, ఉల్లి మల్లయ్య బాల పోచయ్య, వేణు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు అక్షరాస్యతపై అవగాహన

మద్దూరు, మార్చి 4: మద్దూరు మండలం నర్సాయపల్లిలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ఆదేశానుసారం సోమవారం ఉపాధిహామీ కూలీలకు క్లస్టర్ కో ఆర్డినేటర్ పోతుగంటి కరుణాకర్ అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలకు బ్యాంకు అందిస్తున్న సేవలతో పాటు సైబర్ సెక్యురిటీ గురించి వివరించారు.

మల్లన్నను దర్శించుకున్న మేడ్చల్ ఏసీపీ

చేర్యాల, మార్చి 4 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం సందర్శించుకున్నారు. ఆలయ ఈవో బాలాజీశర్మ ఆలయ అర్చకులతో స్వామి ప్రసాదం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బెజ్జంకి, మార్చి 4: మండలంలోని గాగిల్లాపూర్ మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకుని బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అక్రమంగా ఇసుక, బియ్యం రవాణా చేసినా, నిల్వచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కమలాయపల్లిలో ఇసుక డంపు స్వాధీనం

మద్దూరు, మార్చి 4: మద్దూరు మండలం కమలాయపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం చేర్యాల తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక డంపులు నిల్వ చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, మార్చి 4 : మెట్టప్రాంత రైతులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం ఒక్క వారం రోజులు హుస్నాబాద్‌లో ఉండి వాటిని పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కోరారు. చురుకైన నాయకుడే కాకుండా మంత్రి కూడ కావడంతో రైతుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూసి పరిష్కరించాలన్నారు. సోమవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు, సాగు నీటి సమస్య లేకుండా చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్ కోతలు మొదలయ్యాయని, నీటి వనరులు అడుగంటడంతో రైతులు బోర్లు వేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు రిపేర్ చేసి వాన కాలంలోగా చెరువులు, కుంటలను నింపి సాగునీటి సమస్య లేకుండా చేయాలన్నారు. ఈ సమావేశంలో హన్మకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్మన్ గోపాల్‌రావు, రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, ఎంపీపీ మానస, జడ్పీటీసీ భూక్య మంగ, దేవేందర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మండలాల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, ఎండీ అన్వర్, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లను తప్పకుండా తీసుకోవాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, మార్చి 4: పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఏదైనా స్థలం, భవనంలోని షటర్లలో వ్యాపారం నిర్వహించుకోవాలని అనుకునేవారు మున్సిపల్ నుంచి ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా పొందలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ ఆమె మాట్లాడుతూ.. ప్రతీ వ్యాపారస్తుడు సకాలంలో ట్రేడ్ లైసెన్స్ తీసుకోని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చిన్నకిష్టాపూర్‌లో ఉచిత మగ్గంవర్క్ శిక్షణ



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఆనంద్

జగదేవ్‌పూర్, మార్చి 4: ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఆనంద్ తెలిపారు. నాబార్డు సహకారంతో కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌లో సోమవారం మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 20 రోజుల శిక్షణలో భాగంగా నేర్చుకునే మహిళలకు మధ్యాహ్న భోజనంతో పాటు రూ.వెయ్యి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని, అదనపు ఆదాయం పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రవి, సంస్థ డైరెక్టర్ రాజలింగం, వీవోఏ మంగ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలన



ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్

ములుగు, మార్చి 4: ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభించారని ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ములుగు ఎంపీపీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే కేంద్రాలను ఏర్పాటు చేసిందని, గతంలో దరఖాస్తు చేసుకోని వారికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించామని తెలిపారు. ఎవరైనా దరఖాస్తు చేసుకునేవారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీడీవో కేవీఆర్‌శర్మ, ఎంపీవో నరసింహారావు, సూపరింటెండెంట్ రామచంద్రంరావు పాల్గొన్నారు.